సీఎం జగన్‌కు అండగా నిలవాలి

శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాల జగనన్న లే అవుట్‌లో స్థల పూడిక చేసిన వెంటనే లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని శాసన మండలి సభ్యులు కవురు శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పాలకొల్లు మునిసిపాల్టీలో విలీనమైన భగ్గేశ్వరంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరత్నాల పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో? అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాల కాలంలో అమలు చేయని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మునిసిపల్ సాధారణ నిధులతో డ్రైయినేజీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. శివారు ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరాకి చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేసుకున్నానని తనకు వెంటనే ఇంటి స్థలం అందించాలని వికలాంగురాలు కాసా విజయజ్యోతి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి వైఎస్సార్ సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల కోఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శిద్ధాని మహేష్‌కుమార్, మాజీ సర్పంచ్ శిద్ధాని శివకోటయ్య, గ్రామ పార్టీ నాయకులు కొయ్యే లక్ష్మణరావు, అందే మార్కెండేయులు, జోగి శ్రీనివాస్, అందే అంకయ్య, కుక్కల శ్రీనివాస్, పెచ్చెట్టి శ్రీనివాస్, పీటరసన్ చిన్ని, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, ఏనుగుపల్లి చంద్రశేఖర్, బండి రమేష్, మోర్త గిరీష్, సప్పరపు ప్రసాద్, జమ్ము కాశి, తలుపుల భుజంగరావు, కేశవరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


భగ్గేశ్వరంలో సమస్యలు తెలుసుకుంటున్న శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్

క్లుప్తంగా

చీఫ్‌విప్ ముదునూరిని కలిసిన ఎస్సైలు


చీఫ్‌విప్ ముదునూరితో రూరల్ ఎస్సై సుధాకర్ రెడ్డి

మొగల్తూరు: నరసాపురం టౌన్, రూరల్ ఎస్సైలు బీఎస్‌డీఆర్ ప్రసాద్, కె.సుధాకర్ రెడ్డిలు చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఇప్పటి వరకు టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.సుధాకర్ రెడ్డిని నరసాపురం రూరల్ ఎస్సైగా బదిలీ చేయగా, నరసాపురం టౌన్ ఎస్సైగా బీడీఆర్ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు.

చురుగ్గా పంటబోదె తవ్వకం పనులు


పేరుపాలెంలో పంటబోదె తవ్వకం పనులు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాస్

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదెతవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొగల్తూరులోని నక్కావారిపాలెం, పాలకమ్మ చెరువు, కెపిపాలెం నార్త్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. బుధవారం పేరుపాలెం నార్త్‌లో చేపట్టిన తవ్వకం పనులను ఏపీఓ వై శ్రీనివాస్ పరిశీలించారు. ప్రధాన కాలువలు వదిలే లోపులో పంట బోదె తవ్వకం పనులు పూర్తి చేసి ప్రతీ శివారు ప్రాంతానికి నీరందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పేద రోగికి సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ

పాలకొల్లు అర్బన్: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పాలకొల్లు పట్టణానికి చెందిన ఆసపు చైతన్యకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సహాయాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) చేతుల మీదుగా చైతన్య తల్లిదండ్రులు రామచంద్రరావు – కనకదుర్గ దంపతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లోనే ధాన్యం విక్రయించాలి

భీమవరం అర్బన్: దాళ్వా ధాన్యం ఆర్‌బీకే సెంటర్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ సూచించారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ.. మండలంలో 8 వేల 700 ఎకరాలలో దాళ్వా సాగు చేపట్టగా ఇప్పటివరకు సుమారు 6 వేల 500 ఎకరాలలో ధాన్యం మాసూళ్లు జరిగాయన్నారు. 6 వేల ఎకరాలకు సంబంధించి ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామన్నారు. తాడేరు, బేతపూడి, తుందుర్రు గ్రామాలలో దాళ్వా మాసూళ్లు నత్తనడకన సాగుతున్నాయని త్వరితగతిన పూర్తి చేసి ఒబ్బిడైన ధాన్యాన్ని ఆర్‌బీకే సెంటర్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు.

వైభవంగా వెంకన్న కల్యాణం


అన్నసమారాధనలో పాల్గొన్న గ్రంధి రవితేజ

వీరవాసరం: తోలేరు శివారు వెంకటాపురంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో బుధవారం అక్కడ పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు రవితేజ, భోగిరెడ్డి శ్రీనివాసరావు, గూడూరు ఓంకార్, యింటి రాఘవేంద్ర, డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత


ఇలపర్రులో వైఎస్సార్ బీమా తక్షణ సహాయం రూ.10వేలు అందిస్తున్న సర్పంచ్ పద్మావతి

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆపద్బాంధవుడులా నిలుస్తున్నారని పెనుగొండ సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. ఇలపర్రు ఆబోతుల దిబ్బలో గుండెపోటుతో మరణించిన మాదే శ్రీనివాసరావు కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10 వేలు నగదును బుధవారం సర్పంచ్ దండు పద్మావతి చేతుల మీదుగా అందించారు. సంక్షేమ పథకాలతో ఆదుకోవడమే కాకుండా, ఆపదలోనూ అండగా నిలుస్తున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, పంచాయతీ సభ్యుడు కటిత‌ల మోహన్, గృహసారధి గుణపాటి సంజీవరావులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వైద్యం

పెనుగొండ: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైద్యాన్ని ప్రతీ ఒక్కరికీ అందుబాటులోకి తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో మామిడిశెట్టి కృష్ణవేణికి మంజూరైన రూ.6,84000 చెక్కును అందించారు. రాష్ట్రంలో ఫ్యామిలీ డాక్టర్ వంటి ప్రత్యేక పథకాన్ని ప్రారంభించి పేదలకు అండగా నిలిచారన్నారు. దీంతో ప్రతీ ఇంటికీ వైద్యం అందుతుందన్నారు. అంతేగాకుండా గత ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన ఆరోగ్యశ్రీకి పునరుజ్జీవం పోసి పేదకు మేలు చేశారన్నారు. ఎక్కడా వైద్యం అందడం లేదన్న మాట లేకుండా పూర్తి స్థాయిలో నిత్య పర్యవేక్షణచేస్తున్నారన్నారు. దీంతో పాటు ఆరోగ్యశ్రీ వర్తించని జబ్బులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కేవీ ఎస్ నారాయణ రెడ్డి(వాసు), పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఆచంట ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం పాల్గొన్నారు,


తూర్పుపాలెంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

జర్నలిస్టులకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తాం

పెనుమంట్ర: మండలంలో అర్హత ఉన్న జర్నలిస్టులందరికీ ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తానని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు అన్నారు. బుధవారం పెనుమంట్ర మండలానికి చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు క్యాంప్ కార్యాలయంలో కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్వోతో మాట్లడి జర్నలిస్టులకు ఇళ్లస్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జర్నలిస్టుల వెంట పెనుమంట్ర మండలపరిషత్ అధ్యక్షులు కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసురెడ్డి) ఉన్నారు.

ముస్లి మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలోని ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు చెరువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆలమూరు గ్రామానికి చెందిన ముస్లిం ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, పెనుమంట్ర మండల కోఆప్షన్ సభ్యులు షేక్ రహమన్, ముస్లిం గ్రామ సంఘ అధ్యక్షుడు ఎస్కే నాగూర్ సాహెబ్, కార్యదర్శి ఎస్కే చిట్టిమస్తాన్, లాల్ సాహెబ్, లాల్ నాగూర్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

మొగల్తూరు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున సకాలంలో తాగు నీటిని సరఫరా చేయడంతో పాటు గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు. గ్రామాల్లో చెత్త, చెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు ఎత్తివేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధులకోడు ప్రక్షాళన


వడలిలో సిద్ధులకోడును ప్రక్షాళన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పెనుగొండ: చినుకు పడితే చాలు సమస్యాత్మకంగా మారుతున్న సిద్ధులకోడు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వడలి పంచాయతీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రక్షాళన చేస్తున్నారు. గుర్రపుడెక్కతో నిండిపోయి మురుగు ముందుకు సాగకపోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజల విన్నపంతో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రక్షాళన చేయడం ప్రారంభించారు. ప్రక్షాళనను పనులను బుధవారం సర్పంచ్ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు పర్యవేక్షించారు.

వడలిలో గుండె వైద్య శిబిరం

పెనుగొండ: వడలి పంచాయతీ వద్ద బుధవారం డాక్టర్ వైవీరావు ఆసుపత్రి సహకారంతో గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు ప్రారంభించారు. పరిసర ప్రాంతాలకు చెందిన శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు అందించి, శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన వారికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేష్‌రావు, చిటికెన దుర్గ నాగేంద్ర వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు దేవుడి ఆశీస్సులు


పాందువ్వ లూథరన్ చర్చ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: ప్రజలకు మంచి చేసేందుకు ఆ దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ఉంటాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం ఉండి మండలం పాందువ్వ క్రైస్ట్ లూథరన్ చర్చ్ ప్రతిష్ట కార్యక్రమానికి పీవీఎల్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఏఈఎల్‌సీ అధ్యక్షుడు ఫెడ్రిక్ పరదేశిబాబు, జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ బీ ఆనందకుమార్, పేరిష్ పాస్టర్ రెవరెండ్ ఎం.చింతారావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి పీవీఎల్‌కు ఆశీస్సులు అందజేశారు. అనంతరం సంఘ ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ అందరికీ మంచి చేయడం యేసుప్రభువు బోధనల్లో ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా పరిపాలన చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరిట ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. సీఎం జగన్ రాష్ట్ర ప్రజలందరికీ అన్ని సామాజికవర్గాల వారికి మంచి చేస్తున్నారని రాబోయే రోజుల్లో ఆ ప్రభువు చల్లని దీవెనలు ముఖ్యమంత్రిపై ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లూరి రాంబాబు రాజు, ,గ్రామపార్టీ ప్రధాన కార్యదర్శి గొంతే హరీష్, పెల్లూరి అప్పన్న, పెల్లూరి సుబ్రహ్మణ్యం, గొల్లిపల్లి పోతురాజు, గొల్లిపల్లి యేసు, బొర్రా దానియేలు, యాళ్ళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు అభివృద్ధి పనులు పూర్తి చేయాలి


ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి, జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నరసాపురం: నరసాపురం ఏటిగట్టును శాశ్వత ప్రాతిపదికన పటిష్టపరిచే పనులు సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. సుమారు రూ.30 కోట్లుతో పట్టంలోని గోదావరి గట్టు మధవాయిపాలెం వద్ద చేపట్టిన ఏటిగట్టు పటిష్ట పనులను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గత ఏడాది వరదల సమయంలో పొన్నపల్లి వద్ద వరద ఉధృతికి భయానక వాతావరణం నెలకొందని చెప్పారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రూ.56 లక్షలు తాత్కాలిక మరమ్మతులకు విడుదల చేసిందన్నారు. మళ్లీ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక చొరవతో ఏటిగట్టు శాశ్వత పటిష్టతకు రూ.27 కోట్లతో కొద్దిరోజుల క్రితం పనులు ప్రారంభించినట్టు చెప్పారు. మళ్లీ వర్షాకాలం నాటికి పనులు పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి మాట్లాడుతూ పనులు పూర్తయితే మాటిమాటికి వరద ముంపు సమస్య గోదావరి పరీవాహక ప్రాంతం పొడవునా ఉండదన్నారు. తాను పనులను తరచూ పర్యవేక్షిస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కన్జర్వేన్సీ ఏఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయ వ్యాపారస్తులపై అధికారుల దాడులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై మునిసిపల్ అధికారులు గట్టి చర్యలు చేపట్టారు. బుధవారం మునిసిపల్ శానిటరీ అధికారులు పట్టణంలో పలు వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి తనిఖీలు చేయగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపారస్తుల నుంచి పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ (గ్లాసులు, కవర్లు) మెటీరియల్ అంతటినీ స్వాధీనం చేసుకుని ట్రాక్టర్‌లో మునిసిపల్ కార్యాలయానికి తరలించారు. హానికరమైన ప్లాస్టిక్ దొరికిన ప్రతీ వ్యాపారస్తులతో ఫైన్లు కట్టించుకున్నారు. మరోసారి హానికరమైన ప్లాస్టిక్ మెటీరియల్స్ అమ్మితే ఫైన్‌లతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారస్తులను హెచ్చరించారు. పట్టణంలో ఓ వ్యాపారస్తుడు గోడౌన్‌లో భారీ ఎత్తున ప్లాస్టిక్ మెటీరియల్ నిల్వ పెట్టినట్లు సమాచారం తెలుసుకున్న మునిసిపల్ శానిటరీ అధికారులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. సంబంధించిన వ్యాపారిని గోడౌన్ తాళాలు తీసుకు వచ్చి తెరవాలని కోరగా ఆ వ్యాపారస్తుడు గోడౌన్ తెరవకపోవడంతో అధికారులు చేసేది లేక వెనుదిరిగి వచ్చినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్లాస్టిక్ మెటీరియల్స్‌ను సీజ్ చేస్తున్న మునిసిపల్ శానిటరీ సిబ్బంది

ఎండవేడిమితో ప్రజల బెంబేలు

నరసాపురం రూరల్: వాతావరణంలో మార్పులు కారణంగా ఆకాశంలో మబ్బులు, అంతలోనే ఉక్కబోత, విపరీతమైన ఎండలు తదితర మార్పులతో జనం అల్లాడిపోతున్నారు. గత నాలుగు రోజులుగా వాతావరణంలోని మార్పులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వాతావరణంలోని మార్పులతో భానుడి ప్రతాపం రోజురోజుకూ పెరుగుతుంది. బుధవారం పగటిపూట ఎండ విపరీతంగా ఉండడంతో సాయంత్రం వేళల్లో భరించలేని ఉక్కబోతతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీచిన వేడి గాలులతో ప్రజలు అల్లాడిపోయారు. రహదారులు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి. సాయంత్రం 6 దాటినా వేడి గాలులు వీయడంతో వృద్ధులు, పిల్లలు ఎండ వేడిమిని తట్టుకోలేక అల్లాడిపోయారు. ఇప్పుడే ఎండ వేడిమి విపరీతంగా ఉండడంతో రాబోయే రోజులు ఎలా ఉంటాయో? అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం

పాలకొల్లు సెంట్రల్: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి వి.శాంతకుమారి తెలిపారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో సాక్షి ఆల్బమ్స్‌తో వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాక్షి పత్రికలో ప్రచురించిన అమ్మో ఎండలు, ఎండల్లో హాయ్ హాయ్ వంటి చిత్రాలు, వార్తాల క్లిప్పింగ్స్‌ను క్రమపద్ధతిలో అమర్చి విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. వేసవిలో విద్యార్థులు తీసుకోవాల్సిన అంశాలు, జాగ్రత్తలు, ఆహార నియమాలు, పుస్తకాలు చదవడం, ఇండోర్ గేమ్స్, సాయంత్రం 5 తరువాత అవుట్ డోర్ గేమ్స్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్యకుమార్, కేవీవీ సత్యనారాయణ, వేదాంతం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో ఆల్బమ్స్‌తో విద్యార్థులు

పాఠశాలలో వేసిన సామగ్రిని తొలగించాలి

కాళ్ల: పాఠశాల భవనంలో అనుమతులు లేకుండా ప్రైవేటు వ్యక్తి వేసిన సామగ్రిని వెంటనే తొలగించాలని కాళ్లకూరు సర్పంచ్ సాదు శ్రీదేవి, ఉప సర్పంచ్ నడింపల్లి ప్రదీప్ రాజు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం విలేకరులతో మాట్లాడారు. కాళ్లకూరులో వెంకటాపురం పరిధిలో మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రమాదకరంగా ఉండటంతో ఎవరు ఏ విధంగానో ఉపయోగించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాఠశాల భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటిని నిర్మించుకునేందుకు ఇటుకలు వేశారని ఆరోపించారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసి విద్యాశాఖ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారని. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. పాఠశాల వద్ద ఉన్న ఇటుకలను తొలగించాలని డిమాండ్ చేశారు.


పాఠశాలలో వేసిన ఇటుకలు చూపిస్తున్న ఉప సర్పంచ్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పక్కా ప్రణాళికతో నీటి సరఫరా జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో భీమవరం అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాష్ నగర్, దుర్గాపురం, బీసీ కాలనీ, రాయలం, తదితర ప్రాంతాల ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. ప్రాంతాలవారీగా జనాభా ప్రాతిపదికన నీటి సరఫరా లెక్కించి అందుకు తగినన్ని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్స్, కొత్తవి జారీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డ్రైనేజ్ నిర్మాణాలకు ప్రణాళికను రూపొందించి సమర్పించాలన్నారు. లోసరి రోడ్డు లోని చిన్న వంతెన కల్వర్టు పక్కన పెద్ద ఎత్తున చెత్తను డంపు చేస్తున్నారని దాన్ని తొలగించి చైల్డ్ లింక్ మెష్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ దేవరకొండ అఖిల, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, జిల్లా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారి ఆర్.విజయ్ తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న మున్సిపల్ అధికారులు

దాడి ఘటనలో కేసు నమోదు

ఉండి: మహిళపై దౌర్జన్యం చేసిన ఘటనలో పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరుకు చెందిన పాల దుర్గ అనే మహిళ స్థానికంగా ఉన్న వినాయకుడి గుడి వద్ద టిఫిన్ బండి పెట్టుకుని చిరువ్యాపారం చేస్తుంది. గుడి నిర్వహణ భాధ్యతలు చూసే గాజుల కృష్ణమూర్తి ఆర్‌అండ్‌బీ స్థలంలో ఓ మొక్క నాటాడు. వ్యాపారానికి ఆటంకంగా ఉందని ఆ మొక్కను దుర్గ తొలగించారు. దీంతో దుర్గపై కృష్ణమూర్తి దాడి చేయడంతో ఆమె బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాతల సహకారం అభినందనీయం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతిభావంతులను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు అభినందించడం మంచి పరిణామమని మున్సిపల్ కమిషనర్ ఎం.శివరామ కృష్ణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో ప్రతిభ చాటిన 9 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం పట్టణంలో దాతృత్వం ఎక్కువ అని, పేద విద్యార్థులకు చేయూతనివ్వడంలో దాతలు ముందుంటారని ఈ ఏడాది మున్సిపల్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. దాతల దాతృత్వానికి విద్యార్థుల మంచి ఫలితాలే నిదర్శనమని కమిషనర్ అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 6 మున్సిపల్ హైస్కూల్లో 9 మంది విద్యార్థులు విశేష ప్రతిభ చాటారని అన్నారు. వారికి అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, ప్రదానోపాధ్యాయుడు కే వెంకటరావు, పి.బి శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుంతల పూడిక పనులు

కాళ్ల: గోతులమయమైన ఆర్ అండ్ బీ రహదారి గుంతలు పూడిక పనులు చేపట్టారు. కోమటిగుంట గ్రామం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు సర్పంచ్ బోణం భాగ్యశ్రీ శివకుమార్ జేసీబీ ఏర్పాటు చేయించారు. దీంతో గుంతలు సరి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పనులు చేస్తున్నట్లు తెలిపారు. పనులను వైఎస్సార్‌సీపీ నేత బోనం శివకుమార్ పర్యవేక్షించారు.